సాక్షి తిరుపతి

మంగళవారం । 20 । జూన్ । 2023



అక్కున చేర్చుకుంటూ!

పాకాల మండలంలో గడపగడపకు మహా పాదయాత్ర కొనసాగుతోంది. మోహిత్‌రెడ్డికి అపూర్వ స్వాగతం లభిస్తోంది. - 8లో



కాలుష్యంతో చేపలు మృతి

అరుణానది కాలుష్యమైంది. రసాయన వ్యర్థాలతో నదిలోని చేపలు కూడా మృతి చెందుతున్నాయి. - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
తిరుపతి	36	26
చిత్తూరు	34	26
తిరుమల	31	22
గూడూరు	39	28
నగరి	37	27

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 86,181 మంది స్వామివారిని దర్శించుకోగా.. 30,654 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.59 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024–2025 విద్యాసంవత్సరంలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ విడుదలైంది. ఆ మేరకు తిరుపతి వరదరాజ నగర్‌లోని విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రవేశ పరీక్షలో అర్హత సాధిస్తే అత్యున్నత ప్రమాణాలతో సీబీఎస్‌ఈ సిలబస్‌తో ఉచితంగా చదువు, వసతి కల్పిస్తారని, రెగ్యులర్ చదువుతో పాటు నీట్, జేఈఈ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు సైతం శిక్షణ ఇస్తారని తెలిపారు. జవహర్ నవోదయ పాఠశాలలు దేశ వ్యాప్తంగా 649 ఉన్నాయని, వీటిలో మన రాష్ట్రంలో 15, తెలంగాణలో 9 పాఠశాలలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఒక్కో నవోదయ విద్యాలయంలో గరిష్ఠంగా 80 మంది విద్యార్థులకు 6వ తరగతిలో ప్రవేశం కల్పిస్తారని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ విద్యాసంవత్సరంలో చదువుతున్న వారు అర్హులని తెలిపారు. జాతీయ స్థాయిలో ఈ ప్రవేశ పరీక్షను జనవరి 20, 2024లో నిర్వహిస్తారని, దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 10వ తేదీ వరకు గడువు ఉన్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఆగస్టులో సామూహిక గృహప్రవేశాలు



వెంకటేశ్వరరావు, హౌసింగ్ పీడీ

తిరుపతి అర్బన్: జిల్లాలో జూలై 31వ తేదీ నాటికి జగనన్న లేఅవుట్లలో 23,633 ఇళ్లు పూర్తిచేసి, ఆగస్టు నాటికి సామూహిక గృహప్రవేశాలు చేయనున్నట్టు హౌసింగ్ పీడీ వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 16,177 ఇండ్లు పూర్తి చేశామని, మరో 7,456 ఇళ్లు పూర్తిచేయాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు తిరుపతి నియోజకవర్గంలో 45 శాతం, చంద్రగిరిలో 77 శాతం, సత్యవేడులో 80 శాతం, శ్రీకాళహస్తిలో 53 శాతం, వెంకటగిరిలో 64 శాతం, గూడూరులో 45 శాతం, సూళ్లూరుపేటలో 74 శాతం ఇండ్లు గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. మిగిలిన వాటిని వేగవంతంగా పూర్తిచేస్తామని తెలిపారు.

బీమా..ధీమా





వైఎస్సార్ పశువైద్య బీమాపై అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

'మనది వ్యవసాయ ఆధార జీవనం. కేవలం వ్యవసాయమే కాకుండా దానికి అనుబంధంగా పశుపోషణ పెరగాలి. రైతులను ప్రోత్సహించాలి. అధిక పాల దిగుబడినిచ్చే సంకరజాతి పశువులను అందించాలి. పాడి రైతుకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలవాలి'.. అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా వైఎస్సార్ పశువైద్యబీమాను సరికొత్తగా అమలు చేస్తోంది. రైతు నామమాత్రపు బీమా చెల్లిస్తే మూడేళ్లలో ఆ మూగజీవి మరణిస్తే సంబంధిత పెంపకందారునికి వంద శాతం బీమా మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించింది. ఈ వినూత్న పథకంపై యంత్రాంగం క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది.

రైతుకు వెన్నుదన్నుగా వైఎస్సార్ పశువైద్య బీమా

- తెల్లరేషన్‌కార్డు ఉంటే చాలు
- పశువులకు రూ.395తో మూడేళ్ల వరకు రూ.30 వేల బీమా
- రూ.195తో రూ.15 వేలు
- గొర్రెలకు రూ.35తో రూ.6వేలు
- మేకలకు రూ.75తో రూ.6వేలు
- అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న పశువైద్యశాఖ

తిరుపతి అర్బన్: వ్యవసాయశాఖతోపాటు అనుబంధశాఖల రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ప్రధానంగా పాడి పరిశ్రమను మరింత వృద్ధి చేయడానికి పలు పథకాలతో లబ్ధిచేకూర్చుతోంది. ఓ వైపు వైఎస్సార్ చేయూత ద్వారా పేద మహిళలకు అందిస్తున్న రూ.18,750తో సంకరజాతి ముర్రగేదెలను కొనుగోలు చేయిస్తోంది. అంతేకాకుండా సంపూర్ణ మిశ్ర పేరుతో రూ.18వేల విలువ చేసే దాణాను రూ.6.5 వేలకే అందిస్తోంది. అమూల్ పాల సేకరణ ద్వారా పాడి రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తోంది. పశువులు రోగాల బారినపడి ప్రాణాలు కోల్పోకుండా వైఎస్సార్ సంచార పశువైద్యసేవల పేరుతో 1962కి కాల్ చేస్తే ఇంటివద్దకే వచ్చి వైద్యం చేయిస్తోంది. అవసరమైతే ఆపరేషన్లు, ఉచిత మందులు పంపిణీ చేస్తోంది. జిల్లాలో ఒక్కో నియోజకవర్గానికి రెండు సంచార వైద్యశాలలు ఏర్పాటు చేసింది. రెండేళ్ల కాలంలోనే 20వేల పశువులకు వైద్యం అందేలా చర్యలు చేపట్టింది.

పశువులకు బీమా..రైతుకు ధీమా

ప్రమాదంతో పశువులు, గొర్రెలు, మేకలు మృతి చెందితే...ఆ రైతు అప్పులపాలు కాకుండా రాష్ట్ర ప్రభుత్వం జూన్ 1వ తేదీ నుంచి వైఎస్సార్ పశువైద్య బీమా పేరుతో కొత్త పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ పథకం ఉద్దేశం పాడి రైతులు ఎంత ధర కొనుగోలు చేస్తారో.. అంతే మొత్తాని బీమా ద్వారా చెల్లించనుంది.

- పెద్ద పశువును రూ.30 వేలు పెట్టి కొనుగోలు చేసిన రైతు వైఎస్సార్ పశువైద్య బీమా ద్వారా రూ.350 చెల్లిస్తే చాలు.. అది మూడేళ్ల వరకు వర్తిస్తుంది. ఆ పశువు ప్రమాదంలో మృతి చెందితే తిరిగి రూ.30 వేలు ప్రభుత్వం చెల్లిస్తుంది.
- చిన్న పశువును రూ.15వేలతో కొనుగోలు చేస్తే మూడేళ్లకు రూ.195 చెల్లిస్తే తిరిగి రూ.15వేలు చెల్లిస్తుంది.
- గొర్రెలకు రూ.35, మేకలకు రూ.75 చెల్లిస్తే రూ.6వేలు చెల్లిస్తుంది.
- ఆ మేరకు జూన్ 30వ తేదీకి 14వేల మంది పాడి రైతుల నుంచి వైఎస్సార్ పశువైద్య బీమాను కట్టించడానికి యంత్రాంగం సిద్ధమైంది. ఇప్పటికే ఊరూరా అవగాహన సదస్సులు నిర్వహిస్తుండగా.. కేవలం 15 రోజుల్లోనే 2,842 మంది రైతుల వద్ద బీమా చేయించింది.
- రైతులకు తెల్లరేషన్ కార్డు ఉంటే ఈ పథకానికి అర్హులు.

పశువైద్యశాఖ జిల్లా సమాచారం

ఆవులు, గేదెలు	6 లక్షలు
గొర్రెలు, మేకలు	8 లక్షలు
కోళ్లు	26 లక్షలు
కుక్కలు	5,670

పశువైద్య ఆస్పత్రులు

- జేడీ కార్యాలయం–01
- డీడీ కార్యాలయం–01
- ఏడీ కార్యాలయాలు–17
- డాక్టర్స్ కేంద్రాలు–77
- కాంపౌడర్ కేంద్రాలు–58
- ఆర్బీకేల్లో వెటర్నరీ అసిస్టెంట్లు–257

సద్వినియోగం చేసుకోండి



ప్రభుత్వం జూన్ 1 నుంచి ఏర్పాటు చేసిన వైఎస్సార్ పశువైద్య బీమాకు చెందిన కొత్త పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. నామమాత్రంగా నగదు చెల్లిస్తే మూడేళ్ల పాటు ప్రమాద బీమా వర్తిస్తుంది. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు వంద శాతం బీమా వర్తిస్తుంది. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రవికుమార్, జిల్లా పశువైద్యాధికారి, తిరుపతి జిల్లా

ఉద్యోగుల పక్షపాతి సీఎం జగన్

నాయుడుపేట: ఉద్యోగులు పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కొనియాడారు. నాయుడుపేట మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ ఉద్యోగులు సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కిలివేటి మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల ప్రేమ, అభిమానం కలిగిన నాయకుడు జగనన్న అన్నారు. టీడీపీ హయాంలో చేయలేని పనులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిపెట్టిందన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేట్టిన నాటి నుంచి ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పని చేస్తూ లక్షలాది ఉద్యోగాలు ఇచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు బల్లిప్రభాకర్, కిషోర్, మున్సిపల్ చైర్‌పర్సన్ కె దీపిక, వైస్ చైర్మన్‌లు షేక్ రఫీ, వెంకటకృష్ణారెడ్డి, పసల చెంగయ్య, ఎంపీపీ కె ధనలక్ష్మి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



ఆలయ మహాద్వార గోపురంపై కమ్మేసిన కారుమబ్బులు

హమ్మయ్యా!

విపరీతమైన ఎండ.. ఉక్కపోత నుంచి జనం బయటపడ్డారు. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జిల్లాలో ఓ మోస్తరు వర్షం పడింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. కొన్ని రోజులుగా అల్లాడుతున్న జనానికి ఉపశమనం లభించింది. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం భక్తులు వర్షంలో తడుస్తూ వెళ్లడం కనిపించింది. కారు మబ్బులు కమ్మేయడంతో శ్రీవారి ఆలయ ప్రాంగణం అంతటా కొంత సేపు చీకటిగా మారిపోయింది. – తిరుమల



తిరుమలలో కురుస్తున్న వర్షం



నిర్మానుష్యంగా ఉన్న ఆలయ ప్రాంగణం, మాడవీధులు



తిరుపతిలో తడుస్తూ వెళ్తూ..

జాతీయ బీసీ మహాసభకు రండి



మంత్రి పెద్దిరెడ్డితో నాయకులు కేసన్న, శంకర్రావు, జ్ఞానజగదీష్

- మంత్రి పెద్దిరెడ్డిని ఆహ్వానించిన నేతలు

చిత్తూరు కార్పొరేషన్: తిరుపతిలో ఆగస్టు 7వ తేదీన నిర్వహించనున్న 6వ జాతీయ బీసీ మహాసభకు రావాలని విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని బీసీ నాయకులు ఆహ్వానించారు. సోమవారం తిరుపతిలోని మంత్రి కార్యాలయంలో ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన్న శంకర్రావు, రాయలసీమ సమన్వయకర్త జ్ఞానజగదీష్, జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి క్రాంతికుమార్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగరాజుగౌడ్‌లు మంత్రిని కలిశారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 6వ జాతీయ బీసీ సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారన్నారు. అలాగే పలు రాష్ట్రాల బీసీ పార్లమెంటు సభ్యులను ఆహ్వానించామన్నారు. 28 రాష్ట్రాల నుంచి జాతీయ బీసీ ప్రతినిధులు రానున్నట్లు పేర్కొన్నారు. మండల్ కమిషన్ సిఫార్సు మేరకు బీసీలకు ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు ప్రకటించిన ఆగస్టు 7వ తేదీకి గుర్తుగా ఏపీ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఏటా మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

69 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఎంపిక చేసిన 69 సచివాలయాలల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందిస్తున్నట్లు డీపీఓ లక్ష్మి తెలిపారు. జిల్లాలోని 134 గ్రామాల్లోని ప్రజలు తమ ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లను 69 సచివాలయాల ల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. వారం రోజుల్లో మొత్తం 70 రిజిస్ట్రేషన్లు జరగగా వాటి ద్వారా ప్రభుత్వానికి రూ.10.11 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు.

స్పందనకు ప్రాధాన్యం



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: స్పందనలో వచ్చే ప్రతి అర్జీకి ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జేసీ డీకే బాలాజీ, ఇన్‌చార్జ్ డీఆర్వో కోదండరామిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులుతో కలిసి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి మొత్తం 119 వినతులు అందగా అందులో ఒక్క రెవెన్యూశాఖకు సంబంధించినవే 76 అర్జీలున్నాయన్నారు. ఆయా విభాగాలకు చెందిన అధికారులకు అందజేసి పరిష్కరించేలా చర్యలు చేట్టాలని ఆదేశించారు.

పోలీస్ స్పందనకు 65 ఫిర్యాదులు



ఫిర్యాదుదారునితో మాట్లాడుతున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 65 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు నేరుగా హాజరై ఎస్పీని కలిసి వారి సమస్యలను విన్నవించారు. ఇందులో భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలపై పెద్ద మొత్తంలో ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ తెలిపారు.

విజయా డెయిరీలో అమూల్ ప్రతినిధుల పరిశీలన

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు విజయా డెయిరీని సోమవారం అమూల్ సంస్థ ప్రతినిధులు సందర్శించారు. విజయా డెయిరీని పునఃప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఇటీవల డెయిరీ నిర్వహణను అమూల్ సంస్థకు ప్రభుత్వం అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమూల్ సంస్థ డెయిరీని పునఃప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా డెయిరీ నిర్మాణ పనులకు త్వరలోనే పునాది వేయనున్నారు. ఈ క్రమంలో అమూల్ సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి అమర్‌జీప్‌సింగ్, ప్రాజెక్ట్ ఇన్‌చార్జి విక్రమ్‌చౌడలు డెయిరీని సందర్శించారు. డెయిరీ పరిధిలోని భవనాలు, యంత్రాలు భవిష్యత్తులో ఏమాత్రం ఉపయోగపడతాయన్న విషయాలను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ మేనేజర్ రవికుమార్, ఏఈ సుష్మిత, డీసీఓ వనజ పాల్గొన్నారు.

25న న్యాయశాఖ ఉద్యోగుల సంఘ ఎన్నికలు

తిరుపతి లీగల్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని న్యాయశాఖ ఉద్యోగ సంఘ కార్యవర్గ పదవులకు ఈనెల 25వ తేదీ చిత్తూరులోని పాత కోర్టు ఆవరణలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు న్యాయశాఖ ఉద్యోగులు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ కోర్టుల్లో విధులు నిర్వహిస్తున్న సీనియర్ సూపరింటిండెంట్, సూపరింటిండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, స్టెనోలు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. నాల్గవ తరగతి ఉద్యోగులు అటెండర్లు, ప్రాసెస్ సర్వర్లకు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు ఉండదన్నారు. మొత్తం 534 మంది న్యాయశాఖ ఉద్యోగులు ఓటు హక్కు కలిగి ఉన్నారన్నారు. 11 పోస్టులకు 24 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. ముఖ్యంగా అధ్యక్ష పదవికి చిత్తూరుకు చెందిన గోపీనాథ్ రెడ్డి, తిరుపతికి చెందిన మజ్జిగ చంద్రశేఖర్ పోటీలో ఉన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు కోర్టు విరామ సమయంలో ప్రచారం నిర్వహించారు. న్యాయశాఖ ఉద్యోగులు గంగిరెడ్డి, షాజిద్‌బాషా నరేష్ పాల్గొన్నారు.

ఆశీర్వదిస్తూ..అక్కున చేర్చుకుంటూ..!

- దిగ్విజయంగా గడపగడపకు మహాపాదయాత్ర
- గాదంకి పంచాయతీలో ఉప్పొంగిన అభిమానం
- పూర్ణకుంభంతో మోహిత్‌రెడ్డికి స్వాగతం

పాకాల: మండలంలో వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చేపట్టిన గడపగడపకు మహాపాదయాత్ర దిగ్విజయంగా కొనసాగుతోంది. గాదంకి పంచాయతీలో ఏడో రోజు సోమవారం స్థానికులు అపూర్వ స్వాగతం పలికారు. మంగళ వాయిద్యాలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికి అభిమానాన్ని చాటుకున్నారు. మొదట గుంత గాదంకి గ్రామంలోని వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుంత గాదం, గుంత గాదంకి దళితవాడ, మాదిగపల్లి, గాదంకి, బత్తినవారిపల్లిలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ప్రతీ గడపలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. ప్రభుత్వ పనితీరు, సీఎం జగన్ పాలన, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సేవా తత్వాన్ని వివరించారు.



మోహిత్‌రెడ్డికి మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

కష్టకాలంలో దేవుడిలా ఆదుకున్నాడయ్యా!

కరోనా మహమ్మారి కోరలు చాచిన వేళ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచారని.. లాక్‌డౌన్‌తో ఇంటికే పరిమితమైన వారికి నేనున్నానంటూ.. నిత్యావసర సరుకులు, పండ్లు, కూరగాయలు, కోడిగ్రుడ్లు తదితరాలు అందించారని గ్రామస్తులు గుర్తుచేశారు. ఆయనకు కుటుంబానికి అండగా నిలిచి రుణం తీర్చుకుంటామని గాదంకి గ్రామ ప్రజలు స్పష్టం చేశారు. తండ్రికి తగ్గ తనయుడిగా గొప్ప పేరు సాధించాలని ఆకాంక్షించారు.



వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తున్న మోహిత్‌రెడ్డి

గాదంకి అభివృద్ధి రూ.8.48 కోట్లు

గాదంకి గ్రామ పంచాయతీ అభివృద్ధి ఇప్పటివరకు రూ.8.48 కోట్లు వెచ్చించినట్టు మోహిత్‌రెడ్డి తెలిపారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, సచివాలయ భవనం, నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు వెల్లడించారు. అలాగు యోగా ధ్యానమందిరం, ఆర్వో వాటర్ ప్లాంట్, శ్మశాన వాటికలో సదుపాయాల కల్పన, సిమెంట్ బెంచీల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,050
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,484
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,500
రిటైల్ వెండి గ్రాము	రూ.76.50

దరఖాస్తుల ఆహ్వానం

బాలాయపల్లి(వెంకటగిరిరూరల్): వెంగమాంబపురం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లిషు సబెక్టు బోధనకు అర్హులైన అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ జీఎస్ రాంగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. అతిథి అధ్యాపకులుగా పనిచేయాల్సి ఉంటుందని, ఆసక్తి గల వారు కళాశాల కార్యాలయంలో గురువారం లోపు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ముగిసిన ఎంఈఓ-2 పోస్టుల భర్తీ ప్రక్రియ

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 66 మండలాల ఎంఈఓ-2 పోస్టుల భర్తీ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. రంగనాథయ్య (రేణిగుంట), కోటేశ్వరయ్య (పూతలపట్టు), భాస్కర్ (తొట్టంబేడు), జయవేలు (ఆర్‌సీపురం), భాస్కర్ నాయక్ (తిరుపతి అర్బన్), రాజగోపాల్ (మదనపల్లె), గోవిందస్వామి (నారాయణవనం), బాలసుందరం (పలమనేరు), భీమేశ్వరాచారి (బి.కొత్తకోట), బాలయ్య (శ్రీకాళహస్తి), ఎం. శ్రీనివాసులు (గంగవరం), డి. శ్రీనివాసులు (రొంపిచెర్ల), నారాయణ (నిమ్మనపల్లె), వెంకటలక్ష్మి (వాల్మీకిపురం), బాలసుబ్రహ్మణ్యం (పుత్తూరు), పద్మావతి (పీలేరు), ఎం.శ్రీనివాసులు (కురబలకోట), దయాకరరావ్ (ఏర్పేడు), మునిసుబ్రహ్మణ్యం (బీఎన్.కండ్రిగ), ఎన్. తులసీరామ్ (వడమాలపేట), శంకరయ్య(తిరుపతి రూరల్), భాస్కర్ బాబు (చంద్రగిరి), ఆర్.తులసీరామ్ (పెద్దపంజాణి), మోహన్ (చిత్తూరు), హెచ్‌ఎల్‌ఎన్. ప్రసాద్ (యాదమరి), సతీష్‌బాబు (ఎర్రావారిపాళెం), తాతయ్య (పులిచెర్ల), భాస్కరనాయుడు(పెనుమూరు), యుగంధర్‌రాజు(పిచ్చాటూర్), లింగయ్య (పాకాల), గౌస్‌పీర్ (పీటీఎం), తిరుమల (చౌడేపల్లె), శివరత్నమ్మ (సోమల), నాగసుబ్బరాయుడు (తంబళ్లపల్లె), దామోదరమ్ (వెదురుకుప్పం), ఎం.గణ పతి (గుడిపల్లి), రమేష్ బాబు (బంగారుపాళెం), లక్ష్మయ్య(గుడుపల్లె), దామోదర (సదుం), నాగా ర్జున (కలికిరి), సుబ్బారెడ్డి (గుర్రంకొండ), రామచంద్రారెడ్డి (కలకడ), శ్రీధరరాజు (నింద్ర), గుణశేఖర్‌రెడ్డి (జీడీనెల్లూరు), మనోజ్‌కుమార్ (కార్వేటినగరం), ఆంజనేయులు (రామసముద్రం), ఉష (సత్యవేడు), నమశివాయ(నగరి), మురుగేష్ (వి. కోట), సుబ్రహ్మణ్యంరెడ్డి (కేవీపల్లె), డి.శంకరయ్య (ములకలచెరువు), జనార్దనరాజు (నాగలాపురం), త్యాగరాజరెడ్డి (తవణంపల్లె), సబర్మతి (ఎస్‌ఆర్ పురం), రెడ్డెన్నశెట్టి (పుంగనూరు), దామోదరనాయుడు (ఐరాల), హరిప్రసాద్‌వర్మ (విజయపురం), రవికుమార్ (కేవీబీపురం), నారాయణ (రామకుప్పం), గున్నయ్య (వరదయ్యపాళ్యం), గిరిజ (పాలసముద్రం), రాజారామ్ (కుప్పం), నౌషాద్ (బైరెడ్డిపల్లె), గోవిందరాజులు (శాంతిపురం), గోపీనాథ్ (చిన్నగొట్టిగల్లు) మండలాలకు ఎంఈఓ-2లుగా నియమించినట్లు పేర్కొన్నారు.

జగనన్నకు చెబుదాం అర్జీలకు ప్రాధాన్యం

తిరుపతి అర్బన్: ప్రభుత్వ సంక్షేమ అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. వాటికి పరిష్కార మార్గాలు చూపాలని స్పష్టం చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించాలన్నారు. ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఈనెల 24 నుంచి జూలై 31 వరకు జగనన్న సురక్ష కార్యక్రమం కొనసాగుతుందని, జూలై 1 నుంచి జగనన్న సురక్ష శిబిరాలు ప్రారంభమవుతాయని తెలిపారు. డీఈఓ వీ.శేఖర్, డీపీఓ రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయ్‌కుమార్, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి సుశీలాదేవి, డీఎంహెచ్‌ఓ శ్రీహరి, పీడీ డ్వామా శ్రీనివాసప్రసాద్, సీపీఓ అశోక్‌కుమార్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి శంకర్‌నారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.

మైనారిటీల అభ్యున్నతే లక్ష్యం

నాయుడుపేటటౌన్: ముస్లి, మైనారిటీల సామాజిక అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య స్పష్టం చేశారు. పట్టణంలోని జామీయ మసీదు వద్ద సోమవారం సాయంత్రం వక్ఫ్‌బోర్డు తిరుపతి జిల్లా చైర్మన్ షేక్ సిరాజ్, డైరెక్టర్ షేక్ షరీఫ్‌తో కలిసి హమ్‌సబ్ జగన్‌కే సాథ్ అనే ముస్లింలు రూపొందించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింల సంక్షేమానికి 4 శాతం రిజర్వేషన్ కల్పించారని గుర్తుచేశారు. తండ్రికి తగ్గతనయుడిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మైనారిటీల అభ్యున్నతికి పెద్ద పీట వేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, జామీయా, అమీర్ షావలీ మసిదుల ముతవల్లీలు హాజీషేక్ రంతాల్లా సాహెబ్, హాజీ షేక్ నిజాం, జామీయ మసీదు గౌరవ అధ్యక్షులు షేక్ రఫీ, పలు మసీదుల మత పెద్దలు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

సైదాపురం: ఇంటి ముందు ఉన్న వరండాలో దుస్తులు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని దాడిశెట్టిపల్లి గ్రామంలో సోమవారం విషాదాన్ని మిగిల్చింది. స్థానికుల కథనం.. దాడిశెట్టిపల్లి గ్రామానికి చెందిన అమ్మిటి వెంకటేశ్వర్లు (48) వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఉదయం వర్షం వస్తుండడంతో ఇంటి ముందు ఉన్న వరండాకు ఉన్న తీగపై బట్టలు ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. హుటాహుటిన గూడూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అందరితో కలిసిమెలసి తిరిగే వెంకటేశ్వర్లు మృతి చెందారనే విషయం తెలుసుకుని గ్రామస్తులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



వెంకటేశ్వర్లు(ఫైల్)

మృతదేహం గుర్తింపు

సత్యవేడు: మండలంలోని చిన్న ఈటిపాకం పంచాయతీ పరిధిలోని పాలగుంట గ్రామ చివర ఓ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ 2 పురుషోత్తం రెడ్డి, కానిస్టేబుల్స్ పీజీ.హరి, ఏ.శివ కుమార్ కలిసి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ప్యాంటు జేబులో పూజిత్ ఇంజినీరింగ్ ప్రయివేట్ లిమిటెడ్ పేరున ఉన్న ఐడీ కార్డును గుర్తించారు. స్థానిక కంపెనీకి సమాచారం అందించగా మృతుడు జార్ఖండ్ రాష్ట్రం, గడువా జిల్లా, బాలేకాడ్ గ్రామానికి చెందిన ఉమేష్‌సింగ్ అని, పని అనంతరం రోజు తాగే అలవాటు ఉందని, రెండు రోజులుగా కూలిపనికి రాకపోవడంతో ఇంటికి వెళ్లి ఉండొచ్చని అనుకున్నామని కాంట్రాక్టర్ సూరజ్ కుమార్ తెలిపాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రాచీన శిల్పకళతో ఆలయ పునర్నిర్మాణం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలో వెలసిన శ్రీపసన్న వరదరాజస్వామి ఆలయాన్ని ప్రాచీన శిల్పకళతో పునర్నిర్మిస్తామని రాష్ట్ర దేవాదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప, పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. వారు సోమవారం ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. రాతికట్టడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. వచ్చేధనుర్మాసం నాటికి ఆలయ నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు నూతకరత్నం, శ్రీనివాసులురెడ్డి, కిషోర్‌కుమార్, పవన్‌కుమాన్, ప్రతాప్, రాజేశ్వరి, శోభారాణి, సూర్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పర్యవేక్షిస్తున్న రాష్ట్ర దేవదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప, ఆలయ చైర్మన్ శ్రీనివాసులు

టీటీడీకి బ్యాటరీ వాహనం వితరణ

తిరుమల: గుంటూరుకు చెందిన వై.రఘునాథ రెడ్డి సోమవారం ఉదయం రూ.5.45 లక్షల విలువైన బ్యాటరీ వాహనాన్ని టీటీడీకి విరాళంగా అందించారు. తిరుమల అన్నమయ్య భవనం వద్ద దాత టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి బ్యాటరీ వాహనం తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెన్నై స్థానిక సలహా మండలి చైర్మన్ శేఖర్ రెడ్డి, తిరుమల డీఐ జానకిరామరెడ్డి పాల్గొన్నారు.



టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి బ్యాటరీ వాహనానికి సంబంధించిన పత్రాలు అందజేస్తున్న దాత

ఆగస్టు 7న తిరుపతిలో జాతీయ ఓబీసీ మహాసభ

గూడూరు: తిరుపతిలో ఆగస్టు 7వ తేదీన 25 వేల మంది బీసీ ప్రతినిధులతో జాతీయ మహాసభ నిర్వహించనున్నట్టు ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు తెలిపారు. గూడూరులో సోమవారం ఆయన బీసీ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా అణగారిన వర్గాలకు న్యాయం జరగడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన బీపీ మండల్ నివేదికను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సభకు వేలాదిగా తరలివచ్చి బీసీల ఐక్యతను చాటి చెప్పాలని కోరారు. రాష్ట్ర యువజన అధ్యక్షుడు క్రాంతికుమార్, గుర్రం ద్వారకాశ్రీను, నాగరాజు, సోమశేఖర్, వాసు, జగదీష్, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేశన శంకరరావు

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.2 లక్షల విరాళం

తిరుమల: ముంబైకి చెందిన ఎమ్.ఎస్.సుందరం శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.2 లక్షలు విరాళంగా అందించారు. దాత తరఫున తిరుపతికి చెందిన వై.రాఘవేంద్ర ఈ మేరకు విరాళం డీడీని సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డికి అందజేశారు.

ప్రభుత్వ ఆస్తులపై ప్రకటనలు నిషేధం

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో ప్రభుత్వం ఆస్తులపై ప్రకటనలు, బోర్డింగ్, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడాన్ని నిషేధించిందినట్లు కమిషనర్ హరిత తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షణ్ నిబంధనల్లో భాగంగా వాల్‌పోస్టర్లు అతికించడం పైనా నిషేధించినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

నీటి కాలుష్యంతో చేపలు మృతి

నారాయణవనం: మండల కేంద్రంలోని రంగు పరిశ్రమల నుంచి వెలువడే రసాయన వ్యర్థాలతో అరుణానది కాలుష్యమై, నీటిలో చేపలు మృతి చెందాయి. బొప్పరాజుపాళ్యం, సముదాయం గ్రామ పరిసరాలలో అరుణానదిపై నిర్మించిన వాటర్ స్టోరేజి చెక్‌డ్యాంల వద్ద మృతి చెందిన చేపలను సోమవారం సాయంత్రం స్థానికులు గుర్తించారు. ఇటీవల తమిళనాడులోని ఈరోడ్ ప్రాంత వాసులు ఏర్పాటు చేసిన రంగు పరిశ్రమ నుంచి మోతాదుకు మించి రసాయనాలు అరుణానదిలో కలుస్తుండడంతో చేపలు మృతి చెందాయని స్థానికులు చెబుతన్నారు. పశువులు ఈ కాలుష్య నీటిని తాగితే మృత్యువాత పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు పంట పొలాలు దెబ్బతింటాయని, వెంటనే సంబంధిత అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.



మృతి చెందిన చేపలు

కర్ణాటక మద్యం స్వాధీనం..ఒకరి అరెస్ట్

తిరుపతి క్రైం: నగరంలో అక్రమంగా విక్రయిస్తున్న కర్ణాటక మద్యం 52 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు సీఐ కథనం మేరకు.. జీవకోన శ్మశాన వాటిక వద్ద సోమవారం ఉదయం అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు ఎస్‌ఈబీ అధికారులకు సమాచారం అందింది. దీంతో సీఐ తమ సిబ్బందితో కలసి దాడులు చేసి, జీవకోనకు చెందిన ఆదినారాయణ రెడ్డిని అరెస్టు చేసి, 52 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.




పట్టుబడిన మద్యం బాటిళ్లను చూపిస్తున్న స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నాగరాజురెడ్డి

రోకలిబండతో కొట్టి హత్య

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మద్యం మత్తులో రోకలిబండతో మోది ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటన తొట్టంబేడు మండలం, రౌతుసూరమాల ఎస్టీకాలనీలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. రౌతుసూరమాల ఎస్టీ కాలనీకి చెందిన చెంచయ్య(35) ఆదివారం ఉదయం ఏర్పేడు మండలం, బండారుపల్లిలో కూలిపనుల నిమిత్తం వెళ్లాడు. ఆపై సాయంత్రం తప్పతాగి ఇంటికొచ్చి భార్య, ముగ్గురు పిల్లలపై దాడికి తెగబడ్డాడు. ఈ క్రమంలో అదే కాలనీకి చెందిన చింతయ్య(33) వారిని కాపాడబోయాడు. ఇంతలో చెంచయ్య రోకలిబండతో చింతయ్యపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సీఐ విక్రమ్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు.



చింతయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ విక్రమ్, ఎస్ఐ రాఘవేంద్ర (ఇన్‌సెట్) చింతయ్య(ఫైల్)



నాడు: ఎడారిగా మారిన బ్యారేజ్



నేడు : నీటితో కళకళలాడుతున్న వైఎస్సార్ స్వర్ణముఖి బ్యారేజ్

నాడు వెలవెల..

నేడు కళకళ

వాకాడు వైఎస్సార్ స్వర్ణముఖి బ్యారేజ్ నాలుగేళ్లుగా నీటితో కళకళలాడుతోంది. దాదాపు 20 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తోంది. 2015 నుంచి 2019 వరకు తీవ్ర వర్షాభావం కారణంగా ఎడారిని తలపించిన ఈ బ్యారేజ్.. ప్రస్తుతం ఆయకట్టు రైతులకు వరంలా మారింది.

\- వాకాడు